సామాన్యుడిపై అదనపు భారం

- పెరిగిన వంట గ్యాస్ ధరలతో ప్రజల ఇక్కట్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

కాళ్ల: పెరిగిన గ్యాస్ ధరలతో వినియోగదారులు పలు అవస్థలు పడుతున్నారు. జనం నెత్తిన అదనపు భారం పడటంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ వినియోగదారులపై కేంద్ర ప్రభుత్వం మళ్లీ భారం మోపింది. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.50 మేర పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించగా, పెరిగిన గ్యాస్ ధరలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 14.2 కేజీల గ్యాస్ సిలెండర్ ధర రూ. 840 నుంచి రూ.890కు చేరింది. డెలివరీ బాయ్ ఛార్జీలు రూ.30తో కలిపి వినియోగదారుడు రూ.930 చెల్లించాల్సి ఉంది. ఆయిల్ కంపెనీల ధర పెంపుపై ప్రభుత్వం నియంత్రణ రద్దు చేయడంతో అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, గ్యాస్ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి నెలా వంటగ్యాస్‌పై క్రమం తప్పకుండా రూ.25 పెంచిన విషయం విధితమే. కొంత కాలం వ్యవధి అనంతరం తాజాగా రెట్టింపు ధర పెంచడం కొనుగోలుదారులను కలవరానికి గురి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ తీరుపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధరలను నియంత్రించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ధరలు తగ్గించాలంటూ ఇప్పటికే పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేస్తున్నారు.

ధరలు పెంచేసిన ఆయిల్ కంపెనీలు

ఆయిల్ కంపెనీలు ధరలు అమాంతంగా పెంచేస్తున్నా యని, వంటగ్యాస్ మరో రూ.50 పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వాణిజ్య సిలెండర్ ధర తమకు మోయలేని భారంగా తయా రైందని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తాజాగా గ్యాస్ ధర పెంచడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని సామాన్యులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో గ్యాస్ కనెక్షన్లు ఇలా..

ఉండి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 87739 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పెరిగిన ధరతో వినియోగదారులకు అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2019 ఏప్రిల్ నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అప్పుడు రూ.734 ఉన్న గ్యాస్ ధర 2020 మార్చికి రూ.839, 2021 అక్టోబర్‌కు రూ.930కి పెరిగింది. 2022లో మూడు సార్లు, 2023లో నాలుగుసార్లు, 2024లో ఆరుసార్లు చొప్పున ధరలు పెరిగాయి. ఎన్నికలకు ముందు స్వల్పంగా ధర తగ్గించిన కేంద్ర ప్రభుత్వం మరోసారి గుదిబండ మోపిందని పలువురు ఆరోపిస్తున్నారు. తాజా పెంపుతో గ్యాస్ ధర రూ.890కి చేరింది. మరోవైపు సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో డెలివరీ చార్జీలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గ్యాస్ బండలు

ప్రజల నెత్తిన భారం మోపటం దారుణం



ప్రజల నెత్తిన గ్యాస్ బారం మోపటం చాలా దారుణం. పెరిగిన వంట గ్యాస్ ధరలతో ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడతారు. ప్రభుత్వాలు ప్రజల నెత్తిన భారం మోపటం మాని ప్రజలను ఆదుకోవాలి. పెంచిన గ్యాస్ ధరలను వంటనే తగ్గించాలి.

–గొర్ల రామకృష్ణ, సీపీఎం నాయకుడు

తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఉండి: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉండాలని పుట్టిన బిడ్డను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు సీడీపీఓ వి.వాణీవిజయరత్నం అన్నారు. గురువారం మహదేవపట్నంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణీవిజయరత్నం మాట్లాడుతూ అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.డెబోరామెస్సియానా మాట్లాడుతూ పౌష్టికాహారం ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లలోనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

పాలకోడేరు: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని కుముదవల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో కమ్యూనిటీ స్థాయిలో పౌష్టికాహార లోపం గల పిల్లల బాగోగులు చూడడం కోసం తల్లులకు ఐసీడీఎస్ సిబ్బందిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి మాట్లాడుతూ పిల్లలకు సరైన పోషకాహారం అందించకపోతే మానసికంగానూ, శారీరకంగానూ భవిష్యత్తులో చాలా ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. పోషకాహార లోపం గల పిల్లలను పాలకోడేరు పీహెచ్‌సీలో డాక్టర్ చినమిల్లి రంగం నాయుడు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ వర్కర్లు గోగులమండ జెమీమా, సీహెచ్ కనకదుర్గ, సుబ్బలక్ష్మి, టి.ఆలిస్‌మేరీ, ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి, సచివాలయ ఏఎన్ఎం హేమలత, ఆశా వర్కర్లు పి.మేరీజాస్మిన్, ఎం.మేరీఝాన్సీ, బి.మేరీమణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



ఉండి: గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీఓ వాణీవిజయరత్నం, శాస్త్రవేత్త దెబోరా, డాక్టర్ కీర్తన



పాలకోడేరు: కుముదవల్లిలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

రక్షిత మంచినీరు వృథా

ఆకివీడు: ప్రజల దాహార్తి తీర్చే కుళాయి నీరు నేలపాలైంది. రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌లోని నీరు కుళాయిల ద్వారా ప్రజలకు చేరకుండా నీరుగారిపోయింది. ట్యాంక్‌పై నుంచి పైపులకు వెళ్లాల్సిన ప్రధాన పైప్‌వాల్ మరమ్మతులకు గురవడంతో నీరు లీకై ట్యాంక్‌లోని లక్షలాది గ్యాలన్ల మంచినీరు నేలపాలైంది. స్థానిక నగర పంచాయతీ వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మంచినీరు నేలపాలైందని స్థానికులు వాపోతున్నారు. స్థానిక దొరగారి చెరువు ప్రాంతం నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్, శ్రీనగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, తీగలదొడ్డి తదితర ప్రాంతాలకు ఉదయం కుళాయి నీరందలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



వాటర్ ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

కృత్రిమ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

ఆకివీడు: కృత్రిమ సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీకి చెందిన ఏఐ అండ్ డీఎస్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.డయానాకమల్, ఈ.శాలినీ అవగాహన కల్పించారు. స్థానిక పీఎల్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సైన్సు విద్యార్థులకు ఒక రోజు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంపై గురువారం అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్‌తో భవిష్యత్‌లో మరింత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునే విధానంపై పలు సూచనలిచ్చారు. ఏఐ టూల్స్ గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కృత్రిమ సాంకేతిక అప్లికేషన్లు ఏ విధంగా వినియోగించాలో తెలిపారు. సోలార్ పవర్ వినియోగాన్ని నిరుపయోగం చేయకుండా దానిని ఏ విధంగా వినియోగించుకోవాలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.లావణ్య తెలిపారు. స్థానిక ఫిజిక్స్ మాస్టర్ ముత్యాల వెంకటస్వామి మాట్లాడుతూ సైన్సు కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. హెచ్ఎం తోట పోతరాజు, రిటైర్డ్ హెచ్ఎం జి.జోసఫ్ రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కాల్షియం లోపంతో మోకాళ్ల నొప్పులు

భీమవరం: ప్రస్తుత పరిస్థితిలో ఆరవై ఏళ్లు దాటిన వారికి కాల్షియం లోపించి మోకాళ్లు, నడుం నొప్పులు వస్తాయని హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి.శశికాంత్ చెప్పారు. నివారణకు పౌష్టికాహారం తీసుకుంటూ తగిన వ్యాయామం చేయాలన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంప్‌లో రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ ఆర్. రామకృష్ణంరాజు, చిలుకూరి కుమారదత్తాత్రేయ వర్మ, పి.రామకృష్ణంరాజు, ఎ.సురేంద్ర, గుంటూరు రామరాజు, సీతారామరాజు, కనగర్ల విజయ రామకృష్ణ, గాతల జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

కాళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. పెదఅమిరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ప్రసన్నభారతి అధ్యక్షతన నిర్వహించిన స్కూల్ వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాతూ ప్రభుత్వ పాఠశాల నుంచి సమాజానికి ఉపయోగపడే భావిభారత పౌరులు వెళుతున్నారని, అందువలన మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో కోరా రామ్మూర్తి, ఎంఈవో వి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జవ్వాది కిషోర్, కఠారి విశ్వనాథరాజు, డి.చంద్రశేఖర్, రాజమౌళి కోటేశ్వరస్వామి, శంకర్, పుష్ప రాజ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో దళితుల శ్మశానవాటికలు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆచంట తహసీల్దారు జి.కనకరాజుకు వినతి పత్రం సమర్పించారు. దళితుల శ్మశానవాటికలో రోడ్లు, మంచినీరు, షెడ్లు, జంగిల్ క్లీనింగ్, ప్రహరీ, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. శ్మశాన వాటికలు లేని చోట శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళిత వాడలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, కుసుమే వెంకటేశ్వరరావు, గోసంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

చాంబర్ అధ్యక్షుడు కోటేశ్వరరావుకు అభినందనలు

భీమవరం: చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన పులఖండం కోటేశ్వరరావును గురువారం పట్టణంలోని పలు సంఘాలు సత్కరించాయి. సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో చాంబర్‌లో కోటేశ్వరరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి బోనం పాండురంగారావు, ఉపాధ్యక్షుడు పెన్మత్స రామకృష్ణంరాజు, వైహెచ్ఏఐ భీమవరం యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి కటికిరెడ్డి వెంకటరత్నం, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం కన్వీనర్ తాళ్లపూడి గాంధీ, ఎస్.హనుమంతరావు పాల్గొన్నారు.



చాంబర్ అధ్యక్షుడు కోటేశ్వరరావును సత్కరిస్తున్న పలు సంఘాల నేతలు

ప్రభుత్వ కళాశాలలోనే ఉత్తమ విద్య

ఆకివీడు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ ప్రభుత్వ కళాశాలలలోనే దొరుకుతుందని వైస్ ప్రిన్సిపల్ కె.ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభాపాటవాలతో ఉత్తమ పౌరులుగా తయారవుతున్నారని చెప్పారు. కళాశాలలో 2024–25 ఏడాదిలో నాక్ గుర్తింపు లభించిందని చెప్పారు. కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విద్యార్థులు సన్మార్గం వైపు నడుచుకుంటూ సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటర్‌లో రెండు కొత్త గ్రూపులు

దుంపగడప గ్రామంలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కొత్తగా రెండు గ్రూపులు మంజూరయ్యాయని ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బైపీసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ)) గ్రూపులు ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కళాశాలలో ప్రస్తుతం ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో ప్రవేశాలు కల్పిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కమిటీ చైర్మన్ కాకర్ల రాజరాజేశ్వరి, డాక్టర్ పీబీ ప్రతాప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ ఆనంద్‌కుమార్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ రైతులు పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పొలాల నుంచి తమ పంటలను గట్టుకు చేర్చుకుని ఒబ్బిడి చేసుకోవాలన్నారు. టార్పాలిన్, ప్లాస్టిక్ షీట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుమంట్ర: స్థానిక కొండలమ్మ గుడి వద్ద స్టేట్ హైవే రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం పెనుమంట్రకు చెందిన సత్తి పద్మావతి, భీమవరం మండలం తాడేరుకు చెందిన డ్రైవర్ రామారావు ఆటోలో మార్టేరు వైపు వెళ్తుండగా ఓ కారు వీరి ఆటోను ఢీకొట్టింది. కారులోని ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన పద్మావతి, రామారావులను 108 వాహనంలో పాలకొల్లులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గ్యాస్ ప్రమాదాలపై విద్యార్థినులకు అవగాహన



ఆకివీడు: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కాళ్ల: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

ఆకివీడు: గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో గ్యాస్ ప్రమాదాల నివారణపై డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ లీకైనపుడు వెంటనే విద్యుత్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని, అగ్గి పుల్లలు, గ్యాస్ లైట్లు వెలిగించకూడదన్నారు. కిటికీలు తీసి గ్యాస్ బయటకు వెళ్లిపోయే వరకూ ఏ విధమైన అగ్గి రాజేయకూడదన్నారు. గ్యాస్ మంట బయటకు వస్తే వెంటనే తడి గోనెసంచిని కప్పి మంటలను ఆర్పి, గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను కట్టివేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, హెచ్ఎం ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

కాళ్ల: అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో వెస్ట్‌బెర్రీ స్కూల్‌లో విద్యార్థులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఏమి చేయాలి, ఎలా నివారించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలి



పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

కాళ్ల: ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని కాళ్ల పీహెచ్‌సీ వద్ద ఎంఎల్‌హెచ్‌పీలు గురువారం శాంతియుత నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్స్ వెంటనే ఇవ్వాలన్నారు. తమ సర్వీస్ రెగ్యులైజేషన్ చేయడంతో పాటు హెచ్ఆర్‌ఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గడచిన ఆరు ఏళ్లలో ఒక్క ఇంక్రిమెంట్ అందుకోకుండానే 24 గంటలు పని చేస్తున్న తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సేవా కార్యక్రమాలు అభినందనీయం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న విద్యార్థులు

పాలకోడేరు: విద్యార్థులు వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వైట్ కళాశాల అకడమిక్ డీన్ కుర్రెళ్ల భాస్కరరావు అన్నారు. భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భీమవరంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమానికి ఒక రోజు అయ్యే ఖర్చును అందించారు. ఈ సందర్భంగా అకడమిక్ డీన్ డాక్టర్ కుర్రెళ్ల భాస్కరరావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు నెలలో ఒక రోజు ఏదో ఒక వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వారికి కావలసిన సదుపాయాలను సమకూరుస్తున్నారని తెలిపారు. దీని వలన విద్యార్థుల్లో సేవాగుణం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఏబీవీఎస్ఆర్ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీ కృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ఎండగట్టాలి



ఎస్.ఇల్లిందలపర్రులో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

పెనుమంట్ర: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించాలని ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు అన్నారు. మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, చెరుకువాడ నరేష్‌రాజు నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతంచేయడానికి కార్యకర్తలు అంతా కృషి చేయాలన్నారు. ఎన్నికలలో అమలు చేయలేని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను అరాచకాలను ఎండగట్టేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు దొంగ దుర్గాప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి కిరణ్, సర్పంచ్ వనుం సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ గంటా శ్రీను, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కర్రిశంకర్ శ్రీరామారెడ్డి, దిద్దే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలి



దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆలయాల్లో పని చేస్తున్న దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులకు 2022 పీఆర్‌సీని అమలు చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విత్తనాల శ్రీనివాస్ కోరారు. గురువారం పెనుగొండ వాసవీ నివాస్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమూహ గ్రూపు దేవాలయాల్లో ఉద్యోగుల సర్దుబాటు చేస్తూ పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యూటీ రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు నల్లం రామకృష్ణ, కార్యదర్శి యివ్వల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు సీహెచ్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పిరమిడ్ స్పిరిట్యువల్ జిల్లా కో–ఆర్డినేటర్

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక గోగులమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శ్రీగోగులమ్మ దేవస్థానంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ పాల్గొని జ్ఞానబోధ చేసి, ఉచిత ధ్యాన శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ నక్కెళ్ల వెంకట సత్యనారాయణ, పైడికొండల సూర్యనారాయణ, నలుమూరి పీర్లు, సబ్బారపు వెంకటరావు, కమల, విశ్వేశ్వరరావు, కృష్ణవేణి, సావిత్రమ్మ, యర్రాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు గుర్తింపు కార్డులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో, సమీప ప్రాంతాల్లో రోడ్లు, వీధుల వెంబడి చెత్తను సేకరించి అమ్ముకునే వారు, పారిశుద్ధ్య కార్మికులు విధిగా వృత్తిపరమైన గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ పథకం ద్వారా గుర్తింపు కార్డులు, పీపీఈ కిట్లు, ఆరోగ్య భద్రత, నైపుణ్య శిక్షణ అందజేస్తామన్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరించేవారు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, తదితర గుర్తింపు కార్డులతో తమ పేరు నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

భీమవరం: కేజీఆర్ఎల్ కళాశాల బస్‌స్టాప్ వద్ద ఎన్ఎస్ఎస్, యూబీఏ విభాగాల ఆధ్వర్యంలో గురువారం వేసవి చలివేంద్రాన్ని వైస్ ప్రెసిడెంట్ మెరగాని అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారులు, విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ ఆరేటి రామకృష్ణ ప్రకాష్, కోశాధికారి గన్నాబత్తుల వెంకట శ్రీనివాస్, ప్రిన్సిపల్ మెంటే హరినాథ్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ ఐ.రామచంద్రమూర్తి, పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, ఫార్మసీ డైరెక్టర్ కవల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

22న యూపీఎఫ్ సేవకుల సమావేశం

ఉండి: ఈ నెల 22వ తేదీన మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నార్పీ అగ్రహారం మరనాత మహిమ మందిరంలో రెవరెండ్ ఆనందవాక్య (రాంబాబు) ఆధ్వర్యంలో సేవకుల సమావేశం నిర్వహిస్తామని మండల యూపీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సోడదాసి పీటర్, వై.యోనాతాను తెలిపారు. యూపీఎఫ్ సభ్యులు 22వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రాంతానికి తప్పక హాజరు కావాలని వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: మురుగునీరు పారుదలకు తూరలు ఏర్పాటు చేసే నిమిత్తం రోడ్డుపై తవ్విన గుంతలో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి పడి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. భీమవరం–తాడేపల్లిగూడెం రోడ్డులో డీమార్ట్ సమీపంలో చేస్తున్న పనుల వద్ద బుధవారం రాత్రి మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి గోతులను గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని టుటౌన్ పోలీసులు తెలిపారు.